JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 07-07-2026
Medchal - Malkajgiri । Tuesday 07-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 36
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 36 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com



# ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి

## యాదాద్రి తరహాలో వికారాబాద్

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయడానికి పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజాన్ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో ఎకో పార్కులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా తీర్చిదిద్దాలని, తారామతి, బారాదరి మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను అధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, ప్రధానంగా వికారాబాద్‌లోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. యాదగిరిగుట్ట తరహాలో దేవస్థానానికి పాలక మండలిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. CURE పరిధిలో అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, అందుకోసం ప్రత్యేక అధికారులను నియమించి పనులను ముమ్మరం చేయాలని చెప్పారు. నగరంలో పురానాపూల్ వంటి వారసత్వ సంపదగా నిలిచిన బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి చేసిన తర్వాత అవసరమైతే ట్రాఫిక్‌ను మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు సంబంధించి అధికారులను ఆరా తీసిన ముఖ్యమంత్రి వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ పై కసరత్తును ప్రారంభించాలని చెప్పారు. ఈ సమ్మిట్ కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు.

# మణిపూర్‌లో భద్రతా సిబ్బందిపై మెరుపు దాడి



*ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో భద్రతా సిబ్బంది కాన్వాయ్ తిరుగుబాటుదారులు మెరుపు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు అమరులు కాగా.. మరికొందరు గాయపడ్డారు. 40 అస్సాం రైఫిల్స్ చెందిన సైనిక వాహణి శ్రేణిని సోమవారం టార్గెట్ చేసుకున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో సైన్యం భారీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఉగ్రవాదుల దుశ్చర్యను మణిపూర్ గవర్నర్, సీఎంలు తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన వారిని పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు.*

- మణిపూర్ ఉగ్రదాడి
- మణిపూర్‌లో సైనిక కాన్వాయ్‌ను ఐఈడీతో పేల్చేసిన ఉగ్రవాదులు
- ఇద్దరు జవాన్లు మృతి, పలువురికి గాయాలు

జయభేరి, న్యూఢిల్లీ:

జాతుల మధ్య వైరంతో అట్టుడికి ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ.. ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు. సోమవారం మధ్యాహ్నం ఉఖరుల్ జిల్లాలో 40 అస్సాం రైఫిల్స్‌కు చెందిన సైనిక కాన్వాయ్‌ను ఐఈడీతో సాయంతో పేల్చేశారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. జిల్లా కేంద్రం ఉఖరుల్ పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలోని జాతీయ రహదారి 202పై ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో వారెంట్ ఆఫీసర్ బల్వంత్ సింగ్, రైఫిల్‌మ్యాన్ సీఎం సింగ్ అమరులైనట్టు అధికారులు తెలిపారు. 40 అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై దాడి అనంతరం భద్రతా దళాలు మొత్తం ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ముష్కరుల కోసం చుట్టుపక్కల గాలింపు ప్రారంభించాయి. ఈ దాడి తర్వాత చాలా గంటల పాటు భారీ కాల్పుల శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. ఇది భద్రతా దళాలకు, తిరుగుబాటుదారులకు మధ్య సుదీర్ఘ కాల్పుల పోరాటం జరిగినట్లు సూచిస్తోంది. ఉగ్రవాదుల క్రూరమైన చర్యలను తీవ్రంగా ఖండించిన మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్.. అమరులైన జవాన్ల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం సహించదని, బాధ్యులను అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించేలా చూస్తుందని ఆయన స్పష్టం చేశారు. మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సమాజంలో ఇటువంటి హింసకు స్థానం లేదని, శాంతిభద్రతలను కాపాడాలనే సామూహిక సంకల్పాన్ని ఇవి బలహీనపరచలేవని గవర్నర్ అన్నారు. మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతిని తెలిపిన ఆయన.. వారికి మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాన్వాయ్‌పై దాడిని మణిపూర్ హోం మంత్రి గోవిందాస్ కొంతౌజం ఖండించారు. ఇలాంటి దాడులు మనమంతా ఆకాంక్షించే శాంతి సామరస్యాలకు భంగం కలిగిస్తాయి... ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'' అని ఆయన అన్నారు. బాధ్యులను న్యాయస్థానం ముందు నిలబెడతామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఈ ఘటనకు కారకులైనవారిపై భద్రతా దళాలు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయని నేను విశ్వసిస్తున్నాను.. మణిపూర్ శాంతి, శ్రేయస్సు, భద్రత కోసం మనందరి సమిష్టిగా ఐక్యంగా ఉందాం'' అని ఆయన అన్నారు. భద్రతా దళాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని, ఆ ప్రాంతానికి ఫోరెన్సిక్ బృందం కూడా చేరుకుని ఆధారాలు సేకరిస్తోందని అధికారులు తెలిపారు.



2 లో

## సన్న వడ్లకు రూ.500 బోనస్ పథకం..

- తెలంగాణ ప్రభుత్వం కొత్త రూల్స్.. వారికి మాత్రమే డబ్బులు..

రైతులు పండించిన సన్న వడ్లకు తెలంగాణ ప్రభుత్వం బోనస్ అందిస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులు విక్రయించిన సన్న వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ జమ చేస్తోంది. వీటిని నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం వేస్తోంది. అయితే ఈ పథకానికి సంబంధించి రేవంత్ సర్కార్ కీలక మార్పులు చేసింది. బోనస్ అందించేందుకు పలు విధివిధానాలు మార్చింది. ప్రస్తుతం జరుగుతున్న వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇక నుంచి ప్రభుత్వం ప్రకటించిన 7 రకాల సన్న రకం విత్తనాలు వేసి పండించిన రైతులకు మాత్రం బోనస్ అందుతుంది.



# జనం సొమ్ము తెగతింటున్నారు

- చిన్న పని కోసం రూ.70 వేలు డిమాండ్ చేసిన తహసీల్దార్

జయభేరి, సిద్దిపేట :


అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు.. ప్రభుత్వ శాఖల్లో కొందరు అధికారులు లంచం కోసం పేద ప్రజలను పట్టి పీడిస్తున్నారు.. అన్ని సక్రమంగా ఉన్న కూడా పైస ఇవ్వనిదే పని చేయరు. ఇక పైసలు ఇస్తే చాలు ఏ పనైనా క్షణాల్లో పూర్తి చేస్తున్నారు.. ఒక వైపు ఏసీబీ అధికారులు దాడులు జరుగుతూనే ఉన్నాయి.. లంచం తీసుకునే దొంగలు దొరికిపోతూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా కొంతమంది అధికారులు మాత్రం అసలు భయపడకుండా లంచాలు తీసుకుంటూనే ఉన్నారు.. తాజాగా సిద్దిపేట జిల్లాలో ఓ తహసిల్దార్ ఏసీబీ అధికారులకు చిక్కడం

...మిగతాది 2 లో

# ముగిసిన సీఎం చంద్రబాబు పర్యటన

- ప్రణాళిక శాఖ వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీఎం
- రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం
- కుప్పంలో పెట్టుబడుల జోరు
- మోడల్ బస్ స్టేషన్, భూ సమస్యకు పరిష్కారం
- రైతులు, పీ4 లబ్ధిదారులతో ముఖాముఖి

జయభేరి, అమరావతి :



వరుసగా వారం రోజుల పాటు నాలుగు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం తిరిగి అమరావతికి రానున్నారు. ఉదయం 11 గంటలకు కుప్పం నుంచి నేరుగా రాష్ట్ర సచివాలయానికి చేరుకోనున్న సీఎం... ఆర్టీజీఎస్ సమీక్షతో పాటు పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. వారం రోజుల పాటు క్షణం తీరిక లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు,

...మిగతాది 2 లో

# ముప్పేట దాడిలో పాకిస్తాన్

2 లో



# ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?

- సిద్ధాపూర్ డంప్ యార్డు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి
- లేనిపక్షంలో బాధిత రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుంది
- మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరిక

జయభేరి, రంగారెడ్డి జిల్లా :

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో డంప్ యార్డు ఏర్పాటు నిర్ణయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో మాజీ మంత్రి,

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## సన్న వడ్లకు రూ.500 బోనస్

సన్న వడ్లకు బోనస్ విషయంలో ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. 2026 వానాకాలంకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన 7 రకాల వరి పంటలకు మాత్రమే బోనస్ అందిస్తారు. విత్తనాలను నమోదు చేసేందుకు ఆన్ లైన్ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. విత్తన డీలర్లు తాము విక్రయించిన వరి రకం విత్తనాలను వెబ్‌సైట్లో పొందుపర్చాల్సి ఉంటుంది. https://seedsgrowerp.com/seedsales/login.php పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ వెబ్‌సైట్ ద్వారా డీలర్లు విత్తనాలను నమోదు చేయాల్సి ఉంటుంది. డీలర్లు క్యూఆర్ కోడ్ ద్వారా ఈ పోర్టల్‌లోకి సులువుగా లాగిన్ అవ్వొచ్చు. సన్న వరి రకం విక్రయాల ఆప్షన్‌ను ఎంచుకుని విత్తనాలు కొనుగోలు చేసిన రైతు పేరు, తండ్రి పేరు, విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్, సీడ్ ప్యాకెట్ సైజ్, కొనుగోలు చేసిన తేదీ లాంటి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. 2026 వానాకాలం సీజన్‌లో విక్రయించే విత్తనాలకు మాత్రమే ఈ డిజిటల్ విధానం అమల్లో ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిక గడువు లేదీలోగా విత్తన డీలర్లు వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ర్‌ఎన్‌ఆర్-15048, బీపీటీ-5204, కేఎన్‌ఎం-1638, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యుజీఎల్-44, కేఎన్‌ఎం-7715 రకాలు పండించిన రైతులకు మాత్రమే బోనస్ అందిస్తారు. ఆన్ లైన్ రికార్డుల్లో నమోదు అయినా రైతులకు మాత్రమే బోనస్ జమ చేశారు. ఇక విత్తన డీలర్ల వద్ద కాకుండా సొంతగా విత్తనాలను భద్రపర్చుకుని సాగు చేసే రైతులు తమ మండల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. ఇక వ్యవసాయ శాఖ యాప్‌లో రైతులు స్వయంగా తమ విత్తన రకం వివరాలను నమోదు చేసుకోవచ్చు. బోనస్ జమలో అక్రమాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుని కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల తాము ఏ విధంగా నష్టపోతున్నామో వివరిస్తూ ఆయన ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పక్షాన పోరాడాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. రైతుల వినతిపై స్పందించిన మాజీ మంత్రి హరీశ్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం. 641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్య. పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనం. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. సిద్దాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయి.

ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న 'గుట్ట చెరువు' నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ చెరువు పక్కనే డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితో పాటు తాగునీటికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. అంతేకాకుండా ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ దర్గా కూడా ఇక్కడే ఉండటంతో, ఆ కాలుష్యం స్థానికులతో పాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయం.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని మేము ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ సంకల్పించింది. కానీ, ఉపాధి కల్పించాల్సిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం డంప్ యార్డు ఏర్పాటు చేసి స్థానిక ప్రజల బతుకులను చిదిమేయాలని చూడటం శోచనీయం. యువతకు అవకాశాలు కల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజాపాలనా? ప్రభుత్వం డంప్ యార్డులను ఏర్పాటు చేయాలనుకుంటే ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగని చోట, జనావాసాలు, గ్రామాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. కానీ ఇలా పచ్చని పల్లెలను, పొలాలను, రైతులను ఆగమాగం చేయడం ఏమాత్రం తగదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిద్దాపూర్ డంప్ యార్డు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో నష్టపోతున్న ఆ 20 గ్రామాల ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, స్థానిక రైతులకు అండగా నిలబడి పోరాడుతుందని హెచ్చరిస్తున్నాం.

## మెట్రో ముందుకు సాగనివ్వండి..

**హైదరాబాద్, జూలై 6 :**

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ II విస్తరణ పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్ Iను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి విడివిడిగా లేఖలు రాసి పంపారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.గత సమావేశాల నిర్ణయాల ప్రకారం.. మెట్రో ఫేజ్ I ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, హైదరాబాద్ మెట్రో ఫేజ్ II విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్‌బీఐ క్యాప్స్ ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించారు. అయితే, ఈ విషయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరగడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ జాప్యం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్ I నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయని, అలాగే ఫేజ్ II డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని తన లేఖల్లో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్ II విస్తరణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు.

జూన్ నెలలో 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, ఫేజ్ 2 విస్తరణపై కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 45 నిమిషాల పాటు కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెట్రో ఫేజ్ 1 ఆస్తుల విలువ నిర్ధారణ (వాల్యూయేషన్), స్వాధీనానికి అవసరమైన లోన్ సేకరణ, రుణ సంస్థ ఎంపికతో పాటు, ఫేజ్ 2 విస్తరణకు అయ్యే నిర్మాణ వ్యయం, దీర్ఘకాలిక రుణాల సేకరణపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఒక ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడిగా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ నిర్ణయంతో మెట్రో విస్తరణ, స్వాధీన ప్రక్రియలకు ఉన్న ఆటంకాలు తొలిగిపోయాయి.

# ముప్పేట దాడిలో పాకిస్తాన్



పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం ఇప్పుడు కొత్త రూపం తీసుకుంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పాకిస్తాన్ భద్రతా దళాలను మాత్రమే కాకుండా, చైనా ప్రయోజనాలను కూడా నేరుగా లక్ష్యంగా చేసుకుంటోంది. ఇటీవలి దాడులు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుల భద్రతపై ఇది తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.గ్వాదర్ పోర్టు సమీపంలోని జివానీ ప్రాంతంలో జరిగిన ఇటీవలి ఘటనలో బీఎల్ఏ పాకిస్తాన్ సైన్యానికి చెందిన రాడార్ స్టేషన్, ఎయిర్ స్టేషన్ ఔట్‌పోస్టుపై దాడి చేసింది. ఈ ప్రాంతానికి సమీపంలో చైనాకు సంబంధించిన స్థావరం ఉండటం వల్ల ఈ దాడి చైనాపై కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

గ్వాదర్ పోర్టుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ దాడి, హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఉండటం వల్ల వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. బీఎల్ఏ మందుగుండు వాహనంతో ఆత్మాహుతి దాడి చేసినట్లు సమాచారం. దీంతో పాకిస్తాన్ భద్రతా దళాల్లో భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు బీఎల్ఏ నాలుగైదు ప్రధాన వంతెనలను పేల్చివేసి, ఇప్పుడు తీర భద్రతా దళాలపై కూడా దాడులు చేస్తోంది. బీఎల్ఏ తన స్వంత నేవీ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటనలు వచ్చాయి. గతంలో కోస్ట్ గార్డ్ సిబ్బందిపై దాడులు జరిపి, ముగ్గురిని చంపినట్లు బీఎల్ఏ పేర్కొంది.చైనా ఇప్పటికే పాకిస్తాన్ భద్రతా ఏర్పాట్లపై నమ్మకం కోల్పోయి, తన స్వంత రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు చైనా పెట్టుబడుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో కీలక భాగం. గ్వాదర్ పోర్టు ద్వారా చైనాకు అరేబియన్ సముద్రంలో ప్రత్యక్ష ప్రవేశం లభిస్తుంది. ఈ ప్రాంతంలో దాడులు పెరగడం వల్ల ప్రాజెక్టుల అమలు ఆలస్యం కావడం, ఖర్చులు పెరగడం, పెట్టుబడిదారుల నమ్మకం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

బీఎల్ఏ దాడులు ఇప్పుడు చైనా నియంత్రణలో ఉన్నట్లు భావించే ప్రాంతాల్లోకి విస్తరించాయి. ఇది చైనా ప్రణాళికలను భంగపరచడమే కాకుండా, పాకిస్తాన్‌తో చైనా సంబంధాలను కూడా పరీక్షిస్తోంది. చైనా ఇప్పటికే ఉలిక్కిపడి, భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసుకుంటోంది.బీఎల్ఏ దాడులు ఇప్పుడు మరింత సంఘటితంగా, వ్యూహాత్మకంగా మారాయి. గ్వాదర్ పోర్టును తదుపరి టార్గెట్‌గా ఎంచుకోవచ్చని చర్చలు జరుగుతున్నాయి. బీఎల్ఏ తన దాడుల వీడియోలు, సాక్ష్యాలతో సహా విడుదల చేస్తోంది. దీని వల్ల ప్రచారం విస్తృతంగా వ్యాపిస్తోంది. అయితే పాకిస్తాన్ అధికారులు ఈ ఘటనల గురించి బహిరంగంగా మాట్లాడడం లేదు. పత్రికల్లో కూడా విస్తృతంగా కవరేజ్ రావడం లేదు. ఇది ప్రభుత్వం దాడుల పరిమాణాన్ని తక్కువ చేయడానికి లేదా చైనా పెట్టుబడులపై నమ్మకం కల్పించడానికి చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, బీఎల్ఏ ప్రచారం వల్ల వాస్తవాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్నాయి.

ఈ దాడుల నేపథ్యంలో అమెరికా బలూచ్ ఉద్యమానికి మద్దతు ఇస్తోందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది చైనా ప్రభావాన్ని అడ్డుకోవడానికి భాగంగా ఉండవచ్చని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవి ఇప్పటికి అనుమానాలే. చైనా బలూచిస్తాన్ నుంచి వెళ్లిపోవాలనే ఉద్దేశంతో బీఎల్ఏ ఈ దాడులు చేస్తోందని కూడా భావన ఉంది. గ్వాదర్ పోర్టు, సమీప ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు కొనసాగితే, చైనా తన ప్రాజెక్టులను పునఃసమీక్షించవచ్చు లేదా భద్రతా ఖర్చులను బాగా పెంచవచ్చు.బలూచిస్తాన్ సమస్య ఇప్పుడు స్థానిక స్థాయిని దాటి ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను కలిగిస్తోంది. చైనా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, భద్రతా సవాళ్లు రెండు దేశాలను కూడా ఒత్తిడిలోకి తెస్తున్నాయి.

జైష్ ఎ మహ్మద్‌కు కేటాయించిన భూమి సుమారు 5 ఎకరాలు. ఒక ఎకరం సుమారు 4,800 గజాలకు సమానం కాబట్టి మొత్తం స్థలం 24,000 గజాలు అవుతుంది. సాధారణంగా ఒక వ్యక్తిని సమాధి చేయడానికి 6 గజాలు సరిపోతాయని పరిగణిస్తే, ఈ భూమిలో సుమారు 4 వేల మంది వరకు సమాధి చేయవచ్చు. ఇంత పెద్ద ప్రాంతాన్ని కేటాయించడం సాధారణం కాదు.

ఇది భవిష్యత్తులో ఎక్కువ సంఖ్యలో మరణాలను ఊహించి లేదా ఇప్పటికే జరిగిన పెద్ద నష్టాలను సూచిస్తోంది.ఈ సమాధి స్థలాలు ఆపరేషన్ సిందూర్ అనే సైనిక చర్యతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం లష్కర్ ఎ తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్, జైష్ ఎ మహ్మద్‌తోపాటు మరో రెండు ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 11 స్థావరాలపై దాడి చేసింది. బ్రహ్మోస్ క్షిపణులు ఉపయోగించి ఈ దాడులు నిర్వహించారు. నివేదికల ప్రకారం వందల మంది ఉగ్రవాదులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఉమర్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే బతికి ఉన్నట్లు సమాచారం.ఈ వైరల్ ఫొటోలు, స్థల కేటాయింపులను పరిశీలిస్తే ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద సంస్థలపై ఎంత బలమైన దెబ్బ తగిలించిందో అర్థమవుతుంది. ఒక్క జైష్ ఎ మహ్మద్‌కే 5 ఎకరాలు కేటాయించడం, మిగతా సంస్థలకు ప్రత్యేక స్థలాలు ఇవ్వడం. ఇవి అన్నీ ఒకేసారి జరిగిన పెద్ద మరణాలను సూచిస్తున్నాయి. 4 వేల మంది వరకు సమాధి చేయగల స్థలం కేటాయించడం అంటే ఆ సంస్థలు తమ సభ్యులను కోల్పోయిన స్థాయి చాలా ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. బ్రహ్మోస్ వంటి అధునాతన క్షిపణులతో ఏకకాలంలో బహుళ స్థావరాలపై దాడి చేయడం భారత సైన్యం యొక్క ఖచ్చితత్వం, సామర్థ్యం, ఉగ్రవాద వ్యతిరేక నిబద్ధతను చూపిస్తోంది.

ఒక్క ఉమర్ మాత్రమే బతికి ఉండటం మిగతా వారందరూ ఆ దాడిలో చనిపోయినట్లు స్పష్టం చేస్తోంది. ఇది పాకిస్తాన్ భూభాగం నుంచి నడిచే ఉగ్రవాద కార్యకలాపాలకు తీవ్రమైన ఎదురుదెబ్బగా మారింది.అవి ఆపరేషన్ సిందూర్ విజయం, ఉగ్రవాద సంస్థలకు కలిగిన భారీ నష్టానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇలాంటి చర్యలు సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో భారత్ తీసుకుంటున్న చర్యల ప్రభావాన్ని మరింత స్పష్టంగా చూపుతాయి. బీఎల్ఏ దాడులు ఇలాగే కొనసాగితే, సీపీఈసీ ప్రాజెక్టుల వేగం మందగించడం, ప్రాంతీయ అస్థిరత పెరగడం తప్పదు. ఈ పరిస్థితి బలూచిస్తాన్‌లోని స్థానిక గుర్తింపు, వనరుల పంపిణీ సమస్యలను పరిష్కరించకపోతే, మరింత తీవ్రమవుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ముగిసిన సీఎం చంద్రబాబు పర్యటన

సంక్షేమ పథకాలు, పరిశ్రమలు, రైతులుప్రజలతో ముఖాముఖి సమావేశాలతో సీఎం పర్యటన కొనసాగింది. ఈనెల 1న అమరావతి నుంచి బయలుదేరిన సీఎం తొలుత నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గంలోని పున్నపువారి పాలెం చేరుకుని పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సీ కాలనీలో పద్మమ్మకు ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్, తులశమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.68,598 కోట్ల పెన్షన్లు పంపిణీ చేశామని తెలిపారు. నెల్లూరు జిల్లా అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని, త్వరలో మెగా ఫర్నిచర్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు కార్యక్రమం అనంతరం తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మాదన్నపాలెంలో హీరో మోటార్స్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కు సీఎం చంద్రబాబు, హీరో మోటార్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పీ4లో భాగస్వామ్యం కోసం హీరో సంస్థ ముందుకు రాగా, హీరోస్ ఆఫ్ టుమారో స్కాలర్‌షిప్‌లను సీఎం ఆవిష్కరించారు. జూలై 2న తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి వీబీజీ రామ్ జీ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో మూడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి లబ్ధిదారులకు జాబ్ కార్డులు అందజేశారు. కేంద్రం రూ.7,700 కోట్లు, రాష్ట్రం రూ.4 వేల కోట్లతో ఈ పథకం అమలు చేయనుంది. అదే రోజు సాయంత్రం తిరుపతిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర2047 లక్ష్య సాధనలో భాగమైన 'ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్' రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో సీఎం పాల్గొన్నారు. డేటా ఆధారిత పాలన, సాంకేతికతతో సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

జూలై 3న కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను సీఎం ప్రారంభించారు. రూ.16,350 కోట్లతో నిర్మించే స్టీల్ ప్లాంట్‌తో పాటు రూ.20,350 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టుకు కూడా శ్రీకారం చుట్టారు. విజయనగరం జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. కడప నుంచి నేరుగా కుప్పం చేరుకున్న సీఎం మూడు రోజుల పాటు విస్తృతంగా పర్యటించారు. 'స్వర్ణ కుప్పం-పెట్టుబడుల వేదిక'లో రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు ఎంవోయూలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా 39,535 మందికి, పరోక్షంగా 47,539 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఏబీఐఎస్ ప్రోటీన్స్ చికెన్ ప్రాసెసింగ్ యూనిట్, ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్క్‌ను ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కుటుంబాలకు సోలార్ రూఫ్‌టాప్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

కుప్పం రెండో రోజు పర్యటనలో రూ.118 కోట్లతో నిర్మించే అత్యాధునిక మోడల్ బస్ స్టేషన్, డిపోకు సీఎం శంకుస్థాపన చేశారు. ఆరు దశాబ్దాల కంగుంది భూ సమస్యకు పరిష్కారం చూపుతూ 322 మంది రైతులకు 460.19 ఎకరాల డీకేటీ పట్టాలు అందజేశారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి, స్వర్ణ కుప్పం-స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ప్రారంభించారు. రైతులు, పీ4 లబ్ధి మూడో రోజు పర్యటనలో పౌల్ట్రీ రైతులు, అభ్యుదయ రైతులు, పీ4 లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ ఫారాన్ని ప్రారంభించి రైతులతో మాట్లాడారు. ఐటీసీ, విశాలాక్షి ఇన్నోవేషన్స్ సంస్థలతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. కుప్పంలోని 9 వేల బంగారు కుటుంబాల బాధ్యతను అదానీ, టీవీఎస్, మెగా సంస్థలకు అప్పగించామని సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి సోమవారం ఉదయం కుప్పం నుంచి నేరుగా అమరావతి చేరుకోనున్నారు. ఉదయం ఆర్టీజీఎస్ సమీక్ష నిర్వహించనుండగా... మధ్యాహ్నం విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్ల అభివృద్ధి కార్యాచరణపై అధికారులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు.

## జనం సొమ్ము తెగతింటున్నారు

చర్చనీయాంశంగా మారింది.. పూర్తి వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. ఓ భూ సమస్య పరిష్కారం కోసం వచ్చిన ఓ బాధితుడిని వేధించి, లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్ కొర్ర దిలీప్ నాయక్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడి నుంచి 70 వేల రూపాయల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. చేర్యాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న కొర్ర దిలీప్ నాయక్ తన కార్యాలయంలోనే లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కడం జిల్లాలో సంచలనంగా మారింది.

**నాలా కన్వర్షన్ కోసం..**

నాగాపురి గ్రామానికి చెందిన ఓ బాధితుడు తన భూమికి సంబంధించిన నాలా కన్వర్షన్ కోసం చాలా రోజులుగా చేర్యాల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. మొత్తం 11 నాలా దరఖాస్తులను క్లియర్ చేసేందుకు గాను తహసీల్దార్ దిలీప్ నాయక్, బాధితుడిని ఏకంగా 70 వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు వెంటనే మెదక్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

దీనితో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ముందస్తు ప్లాన్ ప్రకారం సోమవారం మధ్యాహ్నం ప్రాంతంలో చేర్యాల తహసీల్దార్ కార్యాలయం పై మెరుపు దాడులు చేశారు. బాధితుడి నుంచి తహసీల్దార్ దిలీప్ నాయక్ 70,000 నగదును తీసుకుంటుండగా.. ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తహసీల్దార్ చేతులకు కెమికల్ టెస్ట్ నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.




**కరీంనగర్, జూలై 6 :**

తెలంగాణలో వర్షాకాలం ప్రారంభమై గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరుతున్న తరుణంలో.. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చుట్టూ మళ్లీ రాజకీయం వేడెక్కింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లను తక్షణమే ఆన్ చేసి, ఎగువన ఉన్న రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ.. భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన బృందంతో కలిసి మేడిగడ్డ పర్యటనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతాంగానికి నీరందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఈ టూర్‌ను ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేసింది.గోదావరిలోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై ఉన్న రాజకీయ కక్షతోనే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేయడం లేదని కేటీఆర్ మండిపడుతున్నారు. కన్నేపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు సురక్షితంగా ఉన్నాయని, వాటిని ఆన్ చేసి నీటిని పంప్ చేస్తే ఎండిపోతున్న ఆయకట్టుకు ప్రాణం పోయవచ్చని బీఆర్ఎస్ వాదిస్తోంది. కేసీఆర్ నిర్మించిన మహా అద్భుత ప్రాజెక్టును పనికిరానిదిగా చిత్రీకరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, దీనిని ఎండగట్టడానికే తాము క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్నట్లు కేటీఆర్ వర్గం స్పష్టం చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పూర్తిగా తోసిపుచ్చింది. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్ల వల్ల ప్రస్తుతం అక్కడ నీటిని నిల్వ ఉంచడం ప్రమాదకరమని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం జూన్ 2027 నాటికి మాత్రమే పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని స్పష్టం చేస్తోంది. కేటీఆర్ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఉన్నాయని కొట్టిపారేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు డిజైన్ల వల్లే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ప్రస్తుతం సెంట్రల్ వాటర్ కమిషన్ , ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల ఆధ్వర్యంలో 13 రకాల కీలక సేఫ్టీ టెస్టులు నడుస్తున్నాయి. ఇలాంటి సాంకేతిక పరీక్షల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా మోటార్లు ఆన్ చేసి నీటిని నిల్వ చేస్తే.. దిగువన ఉన్న భద్రాచలంతో పాటు 44 గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయం చేయాలని చూస్తే సహించేది లేదు" అని మంత్రి హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మళ్లీ ఉభయ పార్టీల మధ్య ఈ శ్రావణ మాసంలో పొలిటికల్ వార్‌కు కేంద్రీకృతంగా మారింది. బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోవడానికి, కేసీఆర్ మార్క్ ప్రాజెక్టును డిఫెండ్ చేసుకోవడానికి చలో మేడిగడ్డ అస్త్రాన్ని ప్రయోగిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం టెక్నికల్ సేఫ్టీ రిపోర్టులను ముందుకు తెచ్చి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, నిర్మాణ లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. రాబోయే రోజుల్లో కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటారా లేదా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు ఎలా హ్యాండిల్ చేస్తారనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు ఆదర్శనీయం: కాంగ్రెస్ నేతలు

- మేడ్చల్‌లో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల నివాళి

జయభేరి, మేడ్చల్ :



భారత మాజీ ఉప ప్రధానమంత్రి, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్ వద్ద, కిష్టాపూర్ గ్రామంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదపడటంతో పాటు, హరిత విప్లవం ద్వారా రైతుల సంక్షేమానికి విశేషంగా ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, యావత్ భారతదేశం గర్వించదగ్గ గొప్ప దేశభక్తుడని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు, సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఉదండపురం సత్యనారాయణ, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవంగు రాకేష్ వంజరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండు శ్రీకాంత్ (చింటు), సీనియర్ నాయకులు నడికొప్పు రంజిత్ ముదిరాజ్, గోమారం బాల్ రెడ్డి, తొంట యాదయ్య, బొక్క రఘుపతి రెడ్డి, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ), రామన్నగారి సంతోష్ గౌడ్, సత్తి రెడ్డి, శివ, రామకృష్ణ, బాలనర్సింహ, బాలకృష్ణ, పానుగంటి మహేష్ కుమార్, విభూది యాదగిరి, చంద్రయ్య గౌడ్, ఆటో విజయ్, లక్ష్మణ్ గౌడ్, మోహన్ రెడ్డి, ప్రభు ముదిరాజ్, హనుమంత్ రెడ్డి, తొంట సుధాకర్, శ్రీరాం రెడ్డి, గణేష్, వేముల రంజిత్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్కతుర్తి రోడ్డుకు మంత్రి పొన్నం శంకుస్థాపన

జయభేరి, హుస్నాబాద్:

ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి రోడ్డు కు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు. మంత్రి మాట్లాడుతూఐ ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, వైస్ చైర్మన్ జిల్లా కలెక్టర్ లకు మా స్థానిక నాయకుల తరుపున ధన్యవాదాలుని అన్నారు. ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి రోడ్డుకు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది.. త్వరగా పనులు పూర్తి చేయాలి. రోడ్డు పూర్తయితే చుట్టుపక్కల భూముల ధరలు కూడా పెరుగుతాయి. ఎల్కతుర్తి లో కోర్టు వస్తుంది,సబ్ స్టేషన్ వస్తుందని అన్నారు. భవిష్యత్ లో ఎల్కతుర్తి అభివృద్ధిలో ముందు ఉంటుంది. ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి రోడ్డు పూర్తయితే అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది. మండలంలో పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని అన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జయభేరి, మేడ్చల్:

మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 1971-1972 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనాటి అనుభవాలను పంచుకున్నారు. తమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడంలో గురువుల మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. అనంతరం తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు మల్లారెడ్డిను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పాత స్నేహాలను మరింత బలోపేతం చేస్తూ ఆనందోత్సాహాల మధ్య సాగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విశేషంగా సహకరించిన వేముల సీతారాం రెడ్డి, గల్వ పాపారావు, కొమరవెల్లి బద్రి నారాయణలకు పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచింది.

## డిసిసి అధ్యక్షుడికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అధికారం లేదు: భేరి ఈశ్వర్



జయభేరి, మేడ్చల్:

తనకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అధికారం మేడ్చల్ నియోజకవర్గ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్‌కు లేదని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత అంశాలను కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేసిన విషయాన్ని ఫోన్ ద్వారా జంగయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లానని, అంతే తప్ప పీసీసీ లేదా డీసీసీ నాయకత్వంపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేఖను బయటకు తీసుకువచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన జంగయ్య యాదవ్ దళితుడినైన తనకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరైన విధానం కాదని భేరి ఈశ్వర్ విమర్శించారు. కొందరు తప్పు చేసినప్పటికీ తనను లక్ష్యంగా చేసుకుని నోటీసులు జారీ చేసి భయపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. డీసీసీ జారీ చేసిన షోకాజ్ నోటీసుల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు తీసుకెళ్లి అక్కడే తేల్చుకుంటానని భేరి ఈశ్వర్ తెలిపారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువతకు స్ఫూర్తి: విక్రమ్ రెడ్డి

- డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు



జయభేరి, మేడ్చల్:

భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సోమవారం గుండ్లపోచంపల్లి డివిజన్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. డివిజన్ అధ్యక్షుడు కావేరీ శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సమగ్రత కోసం, జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉండాలనే లక్ష్యంతో తన జీవితాన్నే త్యాగం చేసిన మహానీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కేంద్ర మంత్రిగా ఆయన పారిశ్రామిక, విద్యా రంగాలకు వేసిన పునాదులు దేశ అభివృద్ధికి నేటికీ మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. ఆయన నిఖార్సైన జాతీయవాదం, నిస్వార్థ సేవా భావం ప్రతి భారతీయుడిలో దేశభక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి జైతువాలా కృష్ణ, మాజీ వార్డు సభ్యుడు మలిగే అశోక్, నాయకులు చెంచాల సురేష్ ముదిరాజ్, నవీన్ కుమార్, గడిల వాసుదేవ్ రెడ్డి, ఉద్దమరి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## పూడూర్–కిష్టాపూర్ డివిజన్‌లో మంగళవారం ఇంటింటి ఓటర్ నమోదు కార్యక్రమం

జయభేరి, మేడ్చల్ :

ప్రభుత్వం చేపట్టిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు 298 పూడూర్-కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 79, 80 (ఎన్‌జీఓస్ కాలనీ)తో పాటు బూత్ నంబర్లు 88, 89 (కిష్టాపూర్ గ్రామం)లో బీఎల్ఏలతో కలిసి ఇంటింటి ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు అకిటి నవీన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ శ్రీ రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ చామకూర మహేందర్ రెడ్డి పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ఉద్యమకారులు, బూత్ కమిటీ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, మహిళా సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నవీన్ రెడ్డి కోరారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో సోమవారం ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ సిఎస్)గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ ను మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయనతో ఎమ్మెల్యే జిఎంఆర్ చర్చించారు.

# ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాలి

- శ్రీనివాస్ గౌడ్

జయభేరి, మేడ్చల్:




ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ అధికారులను కోరారు. మంగళవారం ఉదయం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 84వ బూత్‌లో బూత్ లెవల్ అధికారుల (BLOలు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అత్వెల్లి గ్రామంలోని 15వ బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్లు, BLOలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్యూమరేషన్ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మేడ్చల్ ప్రాంత ప్రజలు తమ ఎన్యూమరేషన్ పత్రాలను సక్రమంగా నింపి ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని BLOలకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించడంతో పాటు అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. లేదంటే నిర్ణయించిన గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేయడం కష్టసాధ్యమవుతుందని అన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చేరుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి జాకట్ ప్రేమ్ దాస్, జిల్లా నాయకుడు బొజ్జ రాఘవరెడ్డి, బూత్ అధ్యక్షుడు రతన్ రాథోడ్, బూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ యోధుడు బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళులు - భేరి ఈశ్వర్

- గుండ్ల పోచంపల్లి డివిజన్‌లో ఘనంగా భారతరత్న బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి

జయభేరి, మేడ్చల్ :



సామాజిక న్యాయానికి జీవితాంతం కృషి చేసిన మహనేత బాబూ జగ్జీవన్ రామ్ అని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ అన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గారిసెల సురేందర్ ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండ్ల పోచంపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ దళితుల ఆశాజ్యోతి, రైతుల నాయకుడిగా, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. దున్నేవాడికే భూమి" అనే నినాదంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు గారిసెల సురేందర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు విశేష కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, అనంతరం కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్, గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భేరి ఈశ్వర్, ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టికాడి విజయకుమార్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు అమరం సురేష్ రెడ్డి, కావేరి శేఖర్ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు దొడ్ల మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందిస్తాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట :



అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన 261 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మాట్లాడారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకంలోనూ ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని, మధ్యవర్తులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జులై 10న విద్యా సంస్థల బంద్

- వామపక్ష విద్యార్థి సంఘాలు
- విద్యారంగ సమస్యల పరిష్కరానికై బంద్
- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంధు వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ

**జయభేరి, పరకాల, జులై 06:**

జూలై 10వ తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్య సంస్థల బందు ను జయ ప్రదం చేయాలని, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ,పిడిఎస్యు జిల్లా కార్యదర్శి నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భాను, ప్రసాద్ ఏఐడీఎస్ఓ, జిల్లా బాధ్యులు వెంకటేష్ ఏ ఐ ఎస్ బీ జిల్లా బాధ్యులు మిస్బా, పి డి ఎస్ యు జిల్లా బాధ్యులు రాంబాబు, అన్నారు సోమవారం రోజున కాకతీయ యూనివర్సిటీలోని పరిపాల భవనం ముందు విద్య సంస్థల బంధు వాల్ పోస్టర్స్ ను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్య రంగాన్ని నాశనం చేస్తుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల కు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్య రంగాన్ని నాశనం చేసే విధంగా పరిపాలన చేస్తుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదించే కుట్రలో ప్రభుత్వం ఉందన్నారు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పటై రెండు సంవత్సరాల నర గడుస్తున్న కూడా ఇప్పటివరకు విద్య శాఖ మంత్రి లేరు అన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ అందలేదన్నారు ప్రైవేట్ కార్పొరేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజుల నియంత్ర చట్టం తీసుకురావాలన్నారు తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ ఎంఈఓ డీఈవో, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్స్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి అధునాతన భవనాలను నిర్మించాలన్నారు. విద్యార్థులకు ఉచిత బస్సు రవాణా శాఖ కల్పించి బస్సులు నడపాలి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25% ఉచిత విద్య ప్రవేశాలు కల్పించాలి అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి ఐదు లక్షల విద్య భరోసా కార్డులు ఉచిత లాప్టాప్ అందించాలన్నారు. ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా తెరిచి పాఠ్య పుస్తకాలు యూనిఫాంసు నోట్ బుక్స్ కేంద్రాలను వెంటనే మూసివేయాలీ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో NEP 2020 అమలు కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్సు కాస్మొటిక్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులను వెంటేనే విడుదల చేయాలి అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల జూలై 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టే తెలంగాణ రాష్ట్ర విద్యా సంస్థల బందును విద్యార్థులు మేధావులు కవులు రచయితలు విద్య సంస్థలు అందరూ మద్దతు తెలిపి బందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు చెన్నూరి సాయికుమార్ బొచ్చు కళ్యాణ్ జస్వంత్ తాజుద్దీన్ జలీల్ నాగరాజ్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.





## ఓబీసీ శిక్షణ తరగతులకు హాజరైన అబ్జర్వర్లు

**జయభేరి, దేవరకద్ర :**

హైదరాబాద్ లోని గాంధీభవన్ లో సోమవారం జరిగిన ఓబీసీ శిక్షణ తరగతుల సమావేశానికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓ బి సి అబ్జర్వర్లు హాజరయ్యారు. వీరంతా అక్కడ జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా అబ్జర్వర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ దేవరకద్ర కు చెందిన రాజమూరి శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశంలో నారాయణపేట జిల్లా అబ్జర్వర్ కోట్ల చంద్రయ్య, వనపర్తి జిల్లా అబ్జర్వర్ కిరణ్ తేజ గౌడ్, మహబూబ్ నగర్ జిల్లా అబ్జర్వర్ లక్ష్మణ్ చారి, వనపర్తి జిల్లా అబ్జర్వర్ శ్రీధర్ లు హాజరయ్యారు.

## దమగ్నాపూర్ లో 'సర్' పై అవగాహన

- హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు భాస్కర్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో సోమవారం ఉంద్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు 'సర్' పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ సోదరుడు జి. భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆయన సర్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## దేవరకద్రలో భక్తులకు అన్నదాన వితరణ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో కొలువు దీరిన శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం దేవాలయంలో గత కొన్ని ఏంళ్ళుగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు అందులో భాగంగానే శ్రీ సద్గురు వీరప్పయ్య తాత వంశస్థులు కీర్తిశేషులు దండిగారి వీరన్న కుమార్తె, శ్రీమతి అత్తేలు విద్యా శ్రీ, అత్తేలి విజయ్ కుమార్ (కెనడా) కుమార్తె సాయి వర్ణిక, అత్తేలు ఉమారాణి లు భక్తులకు ఈ అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శివానంద చారి, పురోహితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 33 కేవీ పరవాడ ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు, కండక్టర్ మార్పిడి, నిర్వహణ పనులు చేపట్టనున్న క్రమంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కశింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ పి. మురళీకృష్ణ తెలిపారు. ఈ కారణంగా పరవాడ, భరణికం, తానం, వెన్నెలపాలెం, గొర్లివానిపాలెం, ఈ.పీ. బోనంగి, పి.ఎస్. బోనంగి, దేశపాత్రునిపాలెం, కలపాక, రావాడ, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, దోసూరు గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ఇతర వినియోగదారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని తెలిపారు.

## వాసాలమర్రి గ్రామాన్ని రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**జయభేరి, తుర్కపల్లి, జూలై 06 :**

తుర్కపల్లి మండలం లోని వాసాలమర్రి గ్రామాన్ని రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించి గ్రామంలోని అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు వివిధ శాఖల జిల్లా అధికారులతో గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి, ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ విద్యుత్ సౌకర్యాలు, సిసి రోడ్డు నిర్మాణం ఇతర మౌలిక వసతులపై అధికారులు స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. వాసాలమర్రి గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణలతో ముందుకు సాగుతోందని అన్నారు. ఈ నెలలో ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమం నేపథ్యంలో వాసాలమర్రి గ్రామం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే విధంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాసాలమర్రి గ్రామంలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందు గ్రామంలోని అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, హౌసింగ్ డిఈ శ్రీరాములు, ఇరిగేషన్ డి ఈ నాగరాజు, ఆర్ అండ్ బి డిఈ శ్రీనివాస్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డిఈ శివకుమార్, ఎంపీఓ వెంకటేశ్వర్లు ఏఈలు నరేష్ ,చక్రధర్, అనంత్ రెడ్డి ,మధునాథ్, భరత్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచులు శివరాత్రి లావణ్య జహంగీర్ సోమల వెంకటేశం ,భూక్య రాజారాం నాయక్, డొంకని రేణుక వెంకటేష్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యులు, గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సీనియర్ జర్నలిస్టు పార్థివదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్

**జయభేరి, తుర్కపల్లి, జూలై 06 :**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రజాతంత్ర సీనియర్ రిపోర్టర్ ముత్రాజ్పల్లి చంద్రం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి తన సొంత గ్రామమైన వీరారెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని అందజేశారు. అనంతరం ఆయన కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి, ఈ క్లిష్ట సమయంలో తాము కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రిపోర్టర్ చంద్రం మృతి ఎంతో బాధాకరం ఎక్కడ కలిసినా ఆప్యాయంగా పలకరించి మంచి మనసుతో సూచనలు చేసే వ్యక్తిగా ఆయన అందరి మనల్ని పొందాలని జర్నలిజం పట్ల నిబద్ధతతో పనిచేసిన ఆయన మరణం తుర్కపల్లి మండలం మీడియా రంగానికి తీరని లోటని, భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూరేలా వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా పరామర్శించిన వారిలో రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, రాష్ట్ర మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య,మండలానికి చెందిన ప్రముఖ నాయకులు, జర్నలిస్టులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.



## సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దు

- మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ హెచ్చరికలు

**జయభేరి, పరవాడ:**

భారత వాతావరణ శాఖ, సంబంధిత అధికారుల హెచ్చరికల మేరకు రాబోయే భారీ వర్షాలు కారణంగా పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో పరవాడ పోలీసులు అప్రమత్త చర్యలు చేపట్టారు.మత్స్యకారులు తదుపరి అధికారిక ఆదేశాలు వెలువడే వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్న వారు వెంటనే సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. అలాగే తీర ప్రాంత ప్రజలు సముద్ర తీరానికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా యంత్రాంగం మరియు వాతావరణ శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని పరవాడ పోలీస్ శాఖ ప్రజలును కోరారు.






## సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ పోటీలకు జి.ధార్మిక శివాన్విత

**జయభేరి, పరవాడ:**

స్విమ్మింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా వారి అధ్వర్యంలోడాక్టర్ టి .ఆర్ . పారివేందర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్, కట్టాంకులత్తూరు, చెన్నై లో ఈ నెల 7 నుండి 12 వరకు జరుగు 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియనషిప్ లో వాటర్ పోలో విభాగం లో అనకాపల్లి స్విమ్మింగ్ అసోసియేషన్ స్విమ్మర్ జి. ధార్మిక శివాన్విత ఎంపికైనది అని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ దేముడు తెలిపారు. ఈమె గత కొన్నేళ్లు గా తన తండ్రి స్విమ్మింగ్ కోచ్ జి. మధు బాబు దగ్గర శిక్షణ పొందుతుంది.ఈ సందర్భంగా ధార్మికను సంస్కృతి గ్లోబల్ స్కూల్ అధినేత పి. సూర్యనారాయణ రెడ్డి మరియు పలువురు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తు లో ఇలాంటి మారేంతో మంది క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముకు అందివ్వాలని ఆకాంక్షంచారు.



## కౌన్సిలర్ శ్రీ కన్య సేవ్య నాయక్ ను సన్మానించిన శివాలయం ఆలయ కమిటీ



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ఐదవ వార్డు శివాలయం దేవాలయం వార్షికోత్సవానికి అతిథిగా విచ్చేసిన కౌన్సిలర్ కన్య సేవియా నాయక్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించడం జరిగింది.

# కేంద్ర కేబినెట్ విస్తరణకు బ్రేక్

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 6 :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మోదీ తన టీమ్‌ను పూర్తిస్థాయిలో మార్చేస్తారని, పనితీరు సరిగ్గా లేని మంత్రులను తొలగించి కొత్త ముఖాలకు, ముఖ్యంగా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేస్తారని అనుకున్నారు. అయితే, శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వర్షాకాల సమావేశాల అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో.. ఢిల్లీ పొలిటికల్ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్లమెంట్ వేదికగా అత్యంత కీలకమైన సెషన్ నడవబోతున్న తరుణంలో.. ఈ లోపు క్యాబినెట్ విస్తరణ చేపట్టే సాహసం ప్రధాని మోదీ చేయడం లేదని, ఈ మార్పు చేర్పుల ప్రక్రియను ఆయన వ్యూహాత్మకంగా వాయిదా వేశారని క్లారిటీ వచ్చిందికేంద్ర కేబినెట్ మార్పుచేర్పుల వాయిదా వెనుక ఒక పక్కా పొలిటికల్ టైమింగ్ దాగి ఉందని తెలుస్తోంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న సమావేశాల ముందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోంది.



ముఖ్యంగా పీఎం, సీఎంల ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ జూలై 17న తన నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లుపై కూడా ఉభయ సభల్లో వాడివేడి చర్చలు జరగనున్నాయి. ఇలాంటి అత్యంత సంక్లిష్టమైన చట్టాలు పాస్ కావాల్సిన సమయంలో క్యాబినెట్‌ను కదిలిస్తే.. ప్రయారిటీ మారిపోతుందని అనుకుంటున్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత, ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ మెగా క్యాబినెట్ విస్తరణ , బిజెపి సంస్థాగత మార్పులు ఏకకాలంలో జరిగే అవకాశం ఉంది.

ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా క్యాబినెట్ విస్తరణపై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాల్సిన అవసరాన్ని ప్రధానికి గుర్తుచేశాయి జూన్ చివరి వారంలో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవ్వడం, ఆ తర్వాత వివిధ శాఖల కార్యదర్శులతో వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘ సమీక్షలు నిర్వహించడం వెనుక.. ఏ ఏ మంత్రుల పనితీరు ఎలా ఉందో స్వయంగా నివేదికలు తెప్పించుకోవడానికేనని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వ మనుగడ, రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను బ్యాలెన్స్ చేయాల్సి ఉన్నందున.. తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం కంటే, పూర్తిస్థాయి నివేదికలతో సెప్టెంబర్‌లో రంగంలోకి దిగడమే ఉత్తమమని ప్రధాని డిసైడ్ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రివర్గ మార్పుల పై వెనక్కి తగ్గలేదు, కేవలం సమయాన్ని మాత్రమే మార్చారు. వర్షాకాల సమావేశాల రూపంలో విపక్షాల నుండి రాబోయే పొలిటికల్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, తమకు కావలసిన కీలక బిల్లులను పార్లమెంట్‌లో గట్టెక్కించుకోవడమే ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఆ తర్వాతే.. సెప్టెంబర్ వేదికగా 'టీం మోదీ' లోకి సరికొత్త భారీ మార్పులు, భారీ చేర్పులు ఉండబోతున్నాయనేది ఢిల్లీ వర్గాల అంచనా...



## సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహణ

**జయభేరి, ఉప్పల్ :**

మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో హాల్ 1 లో సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సంక్షేమం కోసం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న హమాలీ కార్మికుల సేవలు అమూల్యమైనవని అన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కష్టపడి ప్రజలకు అవసరమైన సరుకుల సరఫరాలో హమాలీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. హమాలీ కార్మికుల సంక్షేమం, భద్రత, జీవనోపాధి మెరుగుదలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, వారి అభ్యున్నతికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్, భువనగిరి పార్లమెంట్ BRS పార్టీ ఇంఛార్జి క్యమ మల్లేశం మల్కాజ్ గిరి BRS పార్టీ పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, BRTU నాయకులు రాము బాబు యాదవ్,హమాలీ సంఘం నాయకులు, కార్మికులు, మాజీ కార్పొరేటర్ లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యతకు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

- **జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు**

**జయభేరి, మేడ్చల్ :**



భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త, దేశ సమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని సోమవారం మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత జాతీయ సమగ్రత కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. ఏక్ దేశ్ మే దో విధాన్, దో నిశాన్, దో ప్రధాన్ నహీ చలేగా అనే నినాదంతో దేశ ఐక్యత కోసం ఉద్యమించారని జమ్మూకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ దేశ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నందా రెడ్డి, ఎల్లంపేట మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాగం అర్జున్, జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మహేష్, కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమదాసు, మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, డి. సాయి, బండి విష్ణు, శ్రీనివాస్ ముదిరాజ్, ధాత్రిక లక్ష్మణ్ వంజరి, పుష్ప మల్లారెడ్డి, తోట అనిత, సాదామణి నరేందర్, ఎన్.ఎస్. గౌడ్, రతన్ రాథోడ్, బొజ్జ వంశీ రెడ్డి, అర్జున్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలి

- **బీరప్పగడ్డ డివిజన్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని ఏడీఈకి వినతిపత్రం - ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**

**జయభేరి, ఉప్పల్, జూలై 6:**

బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ ప్రధాన రహదారిలో, బిగ్ బాస్కెట్ హబ్ సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) తెలిపారు. ఈ సమస్యను స్థానిక ప్రజల దృష్టికి తీసుకువచ్చిన అనంతరం, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం. పరమేశ్వర్ రెడ్డి సహకారంతో హబ్సిగూడ సర్కిల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) కి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు చాలా కిందకు వేలాడుతూ ఉండడంతో ప్రజలు చేతులు పైకెత్తినా తాకే పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, పాదచారులకు ఇది ప్రాణాపాయంగా మారిందన్నారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాలు, తీగలపై చెట్ల కొమ్మలు, తీగజాతి మొక్కలు పెరిగి ఉండడంతో వర్షాకాలంలో షార్ట్ సర్క్యూట్, విద్యుత్ అంతరాయం, అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ దృష్ట్యా వెంటనే అధికారులు అక్కడికి వచ్చి పరిశీలించి, వేలాడుతున్న విద్యుత్ తీగలను పైకి ఎత్తి సురక్షితంగా ఏర్పాటు చేయడంతో పాటు చెట్ల కొమ్మలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) పేర్కొన్నారు.

## భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**జయభేరి, కాప్రా,**

సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన మహోన్నీయ సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడలో అలాగే మీర్ పేట హౌసింగ్ బోర్డులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. దేశాభివృద్ధిలో, ప్రజా సేవలో ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై అవగాహన

**జయభేరి, చింతపల్లి :**



చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామ ప్రజలు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, కొత్త ఓటరు నమోదు, పేరు మార్పులు, చిరునామా మార్పులు, తప్పుల సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆమె సూచించారు. గ్రామ ప్రజలు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అవసరమైన పత్రాలతో ముందుకు వచ్చి సహకరించాలని, పారదర్శకమైన మరియు ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఆమెఅన్నారు. అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఉలుపాల శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ బి.ఎల్.ఓ సిమర్ల శ్రీను యాదవ్, జూనియర్ అసిస్టెంట్ రజిత, గ్రామ పాలన అధికారి యాదయ్య, రికార్డు అసిస్టెంట్ వెంకన్న, బి.ఎల్.ఓ లు చింతకుంట్ల అంజమ్మ, గంటెల చంద్రయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాం...

- **కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రతి హామీని ప్రజలలోకి తీసుకెళ్తాం..**
- **డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్కని, పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని కలిసిన నూతనంగా నియమించబడ్డ డివిజన్ అధ్యక్షులు**



**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నూతన డివిజన్ అధ్యక్షులుగా నియామకం అయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్కని, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని కలిసిన పోచారం డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులు సామల అమర్. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకిత భావంతో పనిచేస్తామని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి అభివృద్ధి పనిని ప్రజలలోకి తీసుకెళ్తామని, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పూస రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్తంగి వద్ద భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**జయభేరి, సంగారెడ్డి :**

ముత్తంగి ముంబై జాతీయ రహదారి వద్ద ఎస్వోటీ T పోలీసులు వాహనాల తనిఖీలు ,లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టివేసారు. 21క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. సికింద్రాబాద్ మచ్చ బొల్లారం నుండి గుజరాత్ రాష్ట్రం తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యం లారీని స్థానికంగా ఉన్న శ్రీరామ్ గోదాంకు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరుమృతి




**జయభేరి, శంషాబాద్ :**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మరో రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుండి ఢీకొట్టింది. ప్రమాదంలో కారులోని ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మహిళ, చిన్నారి, మరో ముగ్గురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు.

## సమాఖ్య భవన నిర్మాణ పనులను పరిశీలించిన సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి

**జయభేరి, చింతపల్లి :**



మండలం తీదేడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా సమాఖ్య భవన పనులను గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అదేవిధంగా, మహిళలకు త్వరలోనే భవనం అందుబాటులోకి వచ్చేలా నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళా సమాఖ్య భవనం గ్రామంలోని మహిళల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.
గ్రామాభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని అభివృద్ధి పనులను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయడమే తమ లక్ష్యమని సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు శివర్ల కృష్ణ యాదవ్, బొడ్డు గిరి పాల్గొని నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# హీరోయిన్‌ను పట్టించుకునేవారు కాదు..



సినీ పరిశ్రమ వెలుపల నుంచి చూస్తే గ్లామర్, స్టార్‌డమ్ మాత్రమే కనిపిస్తాయి. కానీ ఆ మెరుపుల వెనుక ఎన్నో అసమానతలు, సవాళ్లు, వివక్ష కూడా ఉంటాయని పలువురు నటీమణులు గతంలో వెల్లడించారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొనే జెండర్ వివక్షపై బహిరంగంగా మాట్లాడి చర్చనీయాంశంగా మారారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి సనన్.. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ సమయంలో ఓ హీరో తనను కావాలనే పక్కన పెట్టేందుకు ప్రయత్నించాడని, తాను ఏ ప్రమోషనల్ ఈవెంట్‌కు హాజరుకావాలో కూడా ఆయనే నిర్ణయించాలనుకున్నాడని తెలిపారు. అలాంటి పరిస్థితి తనకు తీవ్ర అవమానంగా అనిపించిందని, నా అవసరం లేదనుకుంటే మీరు ఒక్కరే సినిమా ప్రమోట్ చేసుకోండి అని చెప్పి తాను వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు. సినిమా సెట్స్‌లో కూడా మహిళా నటీమణులకు, పురుష నటులకు ఇచ్చే ప్రాధాన్యంలో స్పష్టమైన తేడా కనిపించేదని కృతి అన్నారు. హీరోలకు పెద్ద వానిటీ వాన్లు, విశాలమైన గదులు, లగ్జరీ కార్లు ఏర్పాటు చేస్తే.. హీరోయిన్లకు మాత్రం చిన్న గదులు, సాధారణ వాహనాలు కేటాయించేవారని చెప్పారు. తనకు గదుల పరిమాణం లేదా కార్లపై ఆసక్తి లేదని, కానీ అలాంటి తేడాలు మహిళలను తక్కువగా చూసే భావనను కలిగిస్తాయని ఆమె వ్యాఖ్యానించారు. సీనియర్ హీరోల విషయంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు సహజమేనని అంగీకరించిన కృతి.. కొత్తగా వచ్చిన హీరోల విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్లు హీరో సమయాన్ని దృష్టిలో పెట్టుకుని హీరోయిన్లను గంటల ముందే సెట్స్‌కు పిలిచి వేచి ఉండేలా చేసేవారని ఆమె విమర్శించారు.



## ఇంతకీ ఏ ప్లాట్‌ఫాంలోనో తెలుసా..?

### అప్పుడే అఖిల్ అక్కినేని 'లెనిన్' ఓటీటీ రిలీజ్ అప్‌డేట్..

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు..

### వర్చువల్‌గా విచారణకు హాజరైన అల్లు అర్జున్



సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు విచారణలో టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్‌కు వర్చువల్‌గా హాజరయ్యేందుకు నాంపల్లి కోర్టు అనుమతినిచ్చింది. అల్లు అర్జున్ ముంబైలో సినిమా షూటింగ్‌లో ఉండడంతో నాంపల్లి కోర్టు వర్చువల్ విధానానికి అనుమతినిచ్చింది. ఈ మేరకు అల్లు అర్జున్ నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట విచారణకు హాజరయ్యాడు. అయితే ఈ కేసుకు సంబధించి మిగిలిన నిందితులు హాజరు కాకపోవడంతో నాంపల్లి కోర్టు ఈ కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ కేసులో 23 మంది నిందితులపై 500 పేజీల ఛార్జ్‌షీట్ కాపీలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు సమర్పించారు. గత విచారణకు కూడా అల్లు అర్జున్ వర్చువల్‌గానే హాజరయ్యాడని తెలిసిందే. మొత్తం 23 మంది నిందితులు హాజరైతేనే తదుపరి విచారణ ఉంటుందని కోర్టు గతంలో తెలిపింది.

## కింగ్ నాగార్జున 100వ సినిమాలో విలన్‌గా టబూ ..



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10, 2026 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దర్శకుడు రా. కార్తీక్ తెరకెక్కిస్తున్న 'కింగ్100' ఓ ర్యాగ్స్‌టురిచెస్ డ్రామాగా రూపొందుతోంది. తండ్రికూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తన 100వ సినిమా గురించి జూలై 10 తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తానని నాగార్జున స్వయంగా ప్రకటించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.మరోవైపు టబూ పాత్రకు సంబంధించిన వార్తలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## పెళ్లి రోజున సర్‌ప్రైజ్ అని విడాకులు ఇచ్చాడు..



ఒకప్పుడు తెలుగులో సినిమాలు చేసిన మెప్పించిన హీరోయిన్స్ లో సెలీనా జైట్లీ ఒకరు. మంచు విష్ణు నటించిన సూర్యం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఆతర్వాత పెద్దగా తెలుగులో కనిపించలేదు. హిందీలో ఎక్కువగా సినిమాలు చేసి పాపులర్ అయిన ఈ ముద్దుగుమ్మ కెరీర్ పీక్‌లో ఉండగానే పెళ్లి చేసుకుంది. 2011లో వ్యాపారవేత్త పీటర్ హాగ్‌ను పెళ్లి చేసుకుంది. అయితే ఇప్పుడు వీరి విడాకులు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. విడాకుల పై సెలీనా జైట్లీ మాట్లాడుతూ.. నా భర్త మా 15వ పెళ్లి రోజున సర్‌ప్రైజ్ ఇస్తాడని ఆశించా.. అదే సమయంలో నన్ను కారులో పోస్టాఫీసుకు తీసుకెళ్లి కొన్ని పేపర్లు నా చేతిలో పెట్టాడు. అందులో జర్మన్ భాషలో రాసుంది నాకు జర్మన్ రాదు.. అందులో ఏముందో చెప్పమని అడగ్గా అతను చెప్పకుండా నన్ను రోడ్డు మీద వదిలేసి వెళ్ళిపోయాడు. నేను అక్కడి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత నా పిల్లలకు ఇచ్చి అది చదవమని చెప్పా.. నా భర్త నా పై చేసిన దారుణమైన ఆరోపణలను పిల్లల నోటి నుంచి వినాల్సి వచ్చింది.. మొదట అదొక జోక్ అనుకున్నా. కానీ అది నిజం అని తెలిసింది అని కన్నీళ్లు పెట్టుకుంది సెలీనా జైట్లీ. అంతే కాదు తన భర్త, అతని కుటుంబం ఆమె పై ఎదురుదాడికి దిగారు. ముంబై వెళ్లనివ్వమని పిల్లలు కావాలంటే ఆస్ట్రియాలోనే ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోవాలని కండీషన్ పెట్టారు. దాంతో సెలీనా జైట్లీకూడా తన అత్తింటి వారిపై గృహహింస, వేధింపుల కేసులు పెట్టి భరణం, నష్టపరిహారం డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు ఈవివాదం ముదరడంతో స్టార్ హీరోయిన్ జీవితం గందరగోళం అయ్యింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**